రజతోత్సవ సభను విజయవంతం చేయాలి



పోస్టర్ అతికిస్తున్న కార్పొరేటర్ నర్సింహయాదవ్ నాయకులు

ఓల్డ్ బోయిన్‌పల్లి: వరంగల్‌లో 27వ తేదీన నిర్వహించే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను జయప్రదం చేయాలని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అన్నారు. శుక్రవారం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ వైష్ణవిమాతా టెంపుల్ ప్రాంతాల్లో వాల్‌పోస్టర్‌ను అతికించి ప్రచారం నిర్వహించారు. డివిజన్ నుంచి రజతోత్సవ సభకు పెద్ద ఎత్తున తరలాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఇర్ఫాన్, మేకల హరినాథ్, సయ్యద్ ఏజాజ్, బాల్‌రాజు, మక్కాల సత్యనారాయణ, పిట్ల రాజు, నాగేష్, రాజుగౌడ్, గణేష్, మట్టి శ్రీను, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో సమ్మర్ నైట్ క్యాంప్



కూకట్‌పల్లి: కూకట్‌పల్లి అక్షర ఇంటర్నేషనల్ విద్యా సంస్థలో సమ్మర్ నైట్ క్యాంప్ గురువారం రాత్రి అట్టహాసంగా సాగింది. విద్యార్థుల కేరింతల మధ్య ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ నైట్ క్యాంప్ ముగిసింది. పాఠశాల అంటే కేవలం విద్యనే కాదు వారికి జీవితంలో ఉపయోగపడే మరెన్నో విషయాలు నేర్పించేందుకు అక్షర విద్యాసంస్థలు తోడ్పడుతునాయని నిర్వాహకులు తెలిపారు. సంగీత, సాహిత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సీఈఓ మదన్ మోహన్‌రావు, పాఠశాల ప్రిన్సిపాల్ హైమావతి, వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీతో ఏఐఓబీసీఎస్‌ఏ నాయకుల సమావేశం



రాహుల్‌గాంధీతో సమావేశమైన ఏఐఓబీసీఎస్‌ఏ నాయకులు

రాయదుర్గం: అఖిల భారత ఓబీసీ విద్యార్థుల సంఘం జాతీయ, తెలంగాణ, హెచ్‌సీయూ కమిటీ నాయకుల బృందం శుక్రవారం న్యూఢిల్లీలో కాంగ్రెస్‌పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీతో సమావేశమ య్యారు. ఏఐఓబీసీఎస్‌ఏ జాతీయ అధ్యక్షుడు, హెచ్‌సీయూ పరిశోధక విద్యార్థి జి కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో జాతీయ కన్వీనర్, న్యాయవాది పంకజ్‌కుమార్ కుశ్వా, జాతీయ ప్రధాన కార్యదర్శి రితూ, ఉపాధ్యక్షుడు పుష్పరాజ్,బాబాసాహెబ్ అంబేద్కర్ ఇంజనీర్ల సంఘం ప్రతినిధులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. రిజర్వేషన్ల అమలు, విశ్వవిద్యాలయాల్లో బోధనా ఉద్యోగాల నియమకాల్లో రోస్టర్ లోపాలు, సామాజిక న్యాయానికి సంబంధించిన కీలక సమస్యలు ఆయనకు వివరించినట్లు తెలిపారు.

రేపు 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమం

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమం నిర్వహించనున్నారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ఈ సందర్భంగా 'ఆర్ట్ ఆఫ్ హ్యాపీ లివింగ్ అనే అంశంపై గుర్గావ్‌లోని బీకే మెడిటేషన్ సెంటర్ ఇన్‌చార్జీ బి.కె., భావనా ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 040–23001234లో సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

నూతన కమిటీ ఎన్నిక

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్(నాన్ టీచింగ్ స్టాఫ్) అధ్యక్షుడుగా షేక్ నవీద్ మరోసారి ఎంపికయ్యారు. రెండేళ్ల కాలపరిమితి కోసం ఈ అసోసియేషన్ ఎన్నికలను నిర్వహిస్తారు. ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని నూతన అధ్యక్షుడుగా ఎన్నికైన షేక్ నవీద్ శుక్రవారం వివరించారు. వరుసగా ఆయన అధ్యక్షుడిగా ఎంపిక కావడం మూడవ సారి కాగా మొత్తం మీద ఇది అయిదవసారి కావడం విశేషం. కాగా ప్రధాన కార్యదర్శిగా మహ్మద్ షానవాజ్అలీఖురేషి ఎంపికయ్యారు. ఆయన కూడా వరుసగా మూడోసారి ప్రధాన కార్యదర్శిగా ఎంపికయ్యారు. నూతన కార్యవర్గం లో ఉపాధ్యక్షుడుగా ధరమ్‌జీత్‌కుమార్, కోశాధికారిగా రజాక్ షరీఫ్, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా మహ్మద్ జావేద్, ఎండీ ఆసిఫ్, ఎం.ఖయ్యూమ్ ఎంపికయ్యారు.

అక్రమ నిర్మాణాలపై నజర్!

శివారు మున్సిపాలిటీల్లో భవనాలు, వ్యాపార సముదాయాల గుర్తింపునకు చర్యలు

- ఉన్నతాధికారుల ఆదేశాలతో కొనసాగుతున్న లెక్కింపు ప్రక్రియ
- రికార్డులు, నిర్మాణ వ్యత్యాసాలపై ప్రత్యేక దృష్టి
- నిర్లక్ష్యం వహిస్తున్న 'పుర' సిబ్బందికి తాఖీదులపైనా కసరత్తు



మైసమ్మగూడలో నిర్మాణాలు

సాక్షి,సిటీబ్యూరో: నగర శివారు పట్టణాల్లోని అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు. అక్రమంగా నిర్మించిన ఇళ్లు, బహుళ అంతస్తులు, వ్యాపార వాణిజ్య సముదాయాల జాబితా పంపాలని రాష్ట్ర పురపాలిక శాఖ అధికారులు ఆదేశించడంతో నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో ప్రక్రియను ప్రారంభించారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని ప్రతి మున్సిపాలిటీలో అనుమతుల్లేని నిర్మాణాలు పదుల సంఖ్యలో ఉన్నట్లు అధికార యంత్రాంగం భావిస్తోంది.

ప్రత్యేక జాబితాలోకి..రికార్డుల్లో లేని ఇళ్లు

పట్టణాల్లో రికార్డు పరంగా ఉన్న ఇళ్లకు, వాస్తవంగా ఉన్న నిర్మాణాలకు వ్యత్యాసం ఉండడంతో ఆ దిశగా లెక్కింపు చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. వార్డులు/డివిజన్ల వారీగా ఇళ్ల జాబితాను తీసుకుని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. రికార్డుల్లో లేని నిర్మాణాలను ప్రత్యేక జాబితాలో నమోదు చేస్తున్నారు. ఏళ్లుగా భవన నిర్మాణాలు, వ్యాపార వాణిజ్య సముదాయాలు ఉన్నప్పటికీ మున్సిపాలిటీలు, నగర పాలక సంస్థలు రికార్డుల్లో నమోదు చేయకపోవడంతో ఇప్పుడు అవి సంబంధిత అధికారుల దృష్టికి చేరుతున్నట్లు తెలుస్తోంది. 2, 3 అంతస్తులున్న వారు, పెద్ద భవనాలున్న వారు సైతం తమకు ఒక అంతస్తు మాత్రమే ఉందని రికార్డులో నమోదు చేయించుకున్నట్లు తెలుస్తోంది. ఇలాంటివి కూడా లెక్కింపుల్లో బయట పడుతున్నాయి.



పోచారంలో..

చర్యలు ఇలా..

◆ పురపాలక సంఘాల గుర్తింపు ప్రక్రియలో అనుమతుల్లేని నిర్మాణమని తేలితే ఎన్నేళ్ల కిత్రం కట్టారో వివరాలు సేకరిస్తారు. అప్పటినుంచి ఇప్పటివరకు ఎంతమేర పన్ను అవుతుందో ఆ మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుంది.

◆ ఒకే అంతస్తు అనుమతి తీసుకుని 2, 3 అంతస్తులు నిర్మించుకున్న వారికి కూడా ఇదే నిబంధన వర్తిస్తోంది.

◆ సర్వేలో ఇంటికి సంబంధించి పూర్తి వివరాలు, ప్లాటు విస్తీర్ణం, ఇంటిని నిర్మించిన స్థలం, ఖాళీ స్థలం ఎంత ఉంది అనేది గుర్తిస్తున్నారు.

◆ కొత్తగా నిర్మించుకుంటున్న వాటిని పరిశీలించి అనుమతి లేకపోతే నిర్మాణాన్ని నిలిపేయాలని యజమానికి ఆదేశాలిస్తారు.

పకడ్బందీగా..

పురపాలక శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు లెక్కింపు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ అధికార వర్గాలు పేర్కొంటున్నప్పటికీ, ఇందులోనూ రాజకీయ నాయకుల జోక్యం ఉంటున్నట్లు సమాచారం. క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటిని పరిశీలించడంతో పాటు బయటపడిన నిర్మాణాల యజమానులపై చర్యలు తీసుకుంటామని పేర్కొంటున్నా.. ఇందులో కూడా దాగుడు మూతలు ఉన్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

3,691 అక్రమ నిర్మాణాల గుర్తింపు!

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని పురపాలక సంఘాల్లో ఇప్పటివరకు 3,691 అక్రమ కట్టడాలు, బహుళ అంతస్తులు గుర్తించినట్లు తెలుస్తోంది. ఘట్‌కేసర్ మండలం పరిధిలోని మున్సిపాలిటీల్లో 676, దుండిగల్ పరిధిలో 1962, కీసర మండలంలోని మున్సిపాలిటీల్లో 669, తూంకుంట పరిధిలో 206, మేడ్చల్ మండల పరిధిలోని మున్సిపాలిటీల్లో 206, నిజాంపేట్ కార్పొరేషన్‌లో 76, కొంపెల్లి మున్సిపాలిటీలో 42, మేడిపల్లి మండల పరిధిలోని పురపాలక సంఘాల్లో 78, జవహర్‌నగర్‌లో 68 అక్రమ కట్టడాలు ఉన్నట్లు తెలుస్తోంది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల సంఖ్య 1.68 లక్షలు కాగా, 13 పురపాలక సంఘాల పరిధిలో అనుమతుల్లేని భవనాలు, వ్యాపార సముదాయాలు వందల్లోనే ఉంటాయని అంచనా వేస్తున్నారు. జిల్లాలోని ఓ పురపాలక సంఘంలో తాజా మాజీ వైస్ చైర్మన్ 2 అంతస్తుల భవన నిర్మాణానికి అనుమతి తీసుకుని.. 4 అంతస్తులు నిర్మించినట్లు తెలుస్తోంది. మిగతా పురపాలక సంఘాల్లో కూడా మాజీ , తాజా ప్రజాప్రతినిధులకు సంబంధించిన భవనాల అక్రమ బాగోతం బయట పడుతున్నట్లు తెలుస్తోంది. ఇదంతా పురపాలక సంఘాల్లోని టౌన్‌ప్లానింగ్ అధికారులతో సహా కమిషనర్లకు తెలిసినా.. చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతుందని స్థానికులు, పలు స్వచ్ఛంధ సంస్థలు, ప్రజా సంఘాలు , సమాచార హక్కుల కార్యకర్తలు పేర్కొంటున్నారు. చెరువులు, కుంటలు, మురుగు కాలువలు, రోడ్లతో సహా ప్రభుత్వ, అసైన్డ్ భూములను ఆక్రమించి భవనాలను నిర్మించినా రెవెన్యూ, పుర, ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు పట్టణ ప్రజల నుంచి వ్యక్తమవుతోంది.

బస్టాండ్ వద్ద చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రవీందర్ రెడ్డి తదితరులు

బాలానగర్: బాలానగర్‌లోని బస్టాండ్ వద్ద చలివేంద్రాన్ని కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వచ్ఛంద సంస్థలు, దాతలు వేసవి కాలాన్ని దృష్టిలోఉంచుకొని చలివేంద్రాలు ఏర్పాటు చేయడానికి ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు లక్ష్మీనారాయణ, బండారు శివకుమార్, గొర్ల నాగేశ్వరరావు, మండడి సుధాకర్‌రెడ్డి, ఖాజా, కృష్ణమూర్తి, శ్రీనివాస్, రాజేష్, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ కమిటీ ఎన్నిక



కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ కాలనీ 3వ ఫేజ్‌లోని రమ్యా గ్రౌండ్‌లో బీసీల సమావేశం శుక్రవారం జరిగింది. సమావేశానికి యు. శివప్రసాద్ అధ్యక్షత వహించారు. సమావేశంలో బీసీ కూకట్‌పల్లి ప్రాంతీయ కమిటీని ఎన్నుకున్నారు. చైర్మన్‌గా శివప్రసాద్, లీగల్ అడ్వైజర్గా బి. కరుణాకర్ రావు, అడ్వైజర్‌గా వీరస్వామి, విద్యా వెంకట్, శివకుమార్, రామబ్రహ్మం, లింగయ్య, బుచ్చయ్య, గౌరవ అధ్యక్షుడిగా స్వామిగౌడ్, అధ్యక్షుడిగా అంజిబాబు, ఉపాధ్యక్షులుగా కోటేశ్వరరావు, జి. కృష్ణ, జనరల్ సెక్రటరీగా డి. రమేష్, జాయింట్ సెక్రటరీలుగా తుల్జారామ్, శ్యామ్, మహబూబ్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా వై.రాజు, సత్తార్, మేకా కోటేశ్వరరావు, కోశాధికారిగా విద్యా వెంకట్‌ను కమిటి సభ్యులుగా ఎన్నుకున్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి



స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సతీష్‌గౌడ్

బాలానగర్: ఫతేనగర్ డివిజన్ పరిధిలోని గౌతమ్‌నగర్‌లో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ అన్నారు. శుక్రవారం జలమండలి మేనేజర్ అనిల్‌కుమార్‌తో కలిసి సమస్యాత్మక ప్రాంతంలో పర్యటించారు. ఓల్డ్ ఎయిర్‌పోర్టు రోడ్డులోని మసీదు వద్ద, నివాస ప్రాంతాల మధ్య నిత్యం డ్రైనేజీ పొంగిపొర్లుతుందని స్థానికులు వివరించారు. అవసరమైన నూతన డ్రైనేజీ వ్యవస్థ కోసం అంచనాలు తయారు చేయాలని కార్పొరేటర్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మసీదు అధ్యక్షుడు ఎండీ మసూద్ సలావుద్దీన్ నషా ఖాన్, అబ్దుల్ మాలిక్ జాఫర్, అహ్మద్, రహీమ్, సద్దాం, ఖైర్, నిజాం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలి



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్

కార్పొరేటర్ సబిహా బేగం

మోతీనగర్: సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలని కార్పొరేటర్ సబిహాబేగం అన్నారు. అల్లాపూర్ డివిజన్ పరిధిలోని రాజా ప్రతాప్ నగర్‌లో శుక్రవారం రూ.15 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కృష్ణారావు సహకారంతో డివిజన్‌లోని అన్ని బస్తీ, కాలనీల్లో అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయన్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో మాధవాచారి, సాంబయ్య, లింగం, శంకర్, కృష్ణ, రాజయ్య చారి, ప్రసాద్, శేషు, ఓం ప్రకాష్, రాజేందర్, సత్యానారాయణ, రాందాస్, ముత్యాలు, జి. రమేష్, టి.అనిల్, భాగ్యలక్ష్మి, శ్రీదేవి, లావణ్య, యాదవమ్మ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి



కార్మికులకు వాటర్ బాటిల్స్ అందజేస్తున్న ఫౌండేషన్ అధ్యక్షులు శ్రీనివాసరావు

ఆల్విన్‌కాలనీ: జీహెచ్ఎంసీ పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని, నగరాన్ని పరిశుభ్రంగా ఉంచి అవార్డులు తీసుకురావడంలో వారి పాత్ర కీలకమని సత్ సేవ సంస్కృతి ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు అన్నారు. సత్ సేవ సంస్కృతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివేకానంద నగర్ డివిజన్‌లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు వాటర్ బాటిల్స్‌ను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజం నిద్ర లేవకముందే నగరంలో ఆయా ప్రాంతాల్లో కార్మికులు శుభ్రం చేస్తారన్నారు. కార్మికులను ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. కార్యక్రమంలో సత్ సేవ సంస్కృతి ఫౌండేషన్ ఉపాధ్యక్షులు సుబ్బారెడ్డి, కార్యదర్శి రామ్మోహన్‌రావు, సలహాదారులు మహేష్‌గౌడ్, సభ్యులు సాయి, సుహాస్, నరేష్, నాగరాజు యాదవ్, ఎల్లకొండ జయకుమార్ గుప్తా, హరి తదితరులు పాల్గొన్నారు.

దళిత రత్న అవార్డుకు ఎంపికైన వారికి సత్కారం



సన్మానిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: తెలంగాణ ప్రభుత్వ షెడ్యూల్ కులాల అభివృద్ధి సంస్థ ప్రకటించిన దళిత అవార్డుకు ఎంపికైన పలువురు శుక్రవారం పేట్‌బషీరాబాద్ క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే వివేకానంద్‌ను కలిశారు. ఎమ్మెల్యే వారిని సన్మానించి మాట్లాడారు. దళితుల అభ్యున్నతికి కృషి చేస్తున్న వారిని సత్కరించడం సంతోషంగా ఉందన్నారు. వారికి ఎల్లప్పుడు తమ సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సబ్ డివిజన్ అట్రాసిటీ మానిటరింగ్ కమిటీ మెంబర్ మేకల నాగేష్, దళిత రత్న అవార్డు గ్రహీతలు డప్పు రామస్వామి, జోగు వెంకట్, బండ మహేందర్, అమృతయ్య, అబ్రహం, నాగులు, ఉప్పలయ్య, యేసు తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలి



ర్యాలీలో పాల్గొన్న ముస్లింలు

ఓల్డ్ బోయిన్‌పల్లి: వక్ఫ్ సవరణ చట్టాన్ని తక్షణమే కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలని కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం కూకట్‌పల్లి సేవా దళ్ అధ్యక్షుడు అమ్జద్ అలీ, ఏ బ్లాక్ అధ్యక్షుడు షాయిన్‌షా, మైనార్టీ సెల్ డివిజన్ అధ్యక్షుడు ముస్తాఫా ఉస్సేన్ ఆధ్వర్యంలో ముస్లింలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీకి టీపీసీసీ కార్యదర్శి దండుగుల యాదగిరితో కలిసి ఆయన మద్దతు ప్రకటించి మాట్లాడారు. దేశ వ్యాప్తంగా ఉన్న వక్ఫ్ ఆస్తులపై బీజేపీ కన్ను పడిందన్నారు. మతతత్వ పార్టీగా బీజేపీ ముస్లింలకు తీవ్ర అన్యాయం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. హస్మత్‌పేట నుంచి ముస్లిం బస్తీ వరకు పెద్ద ఎత్తున ముస్లింలు ర్యాలీలో పాల్గొని కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో మల్లికార్జునయాదవ్, వాజీద్ పాషా, మోయిజ్, అస్లాం పాషా, షబీర్, ముస్తాఫాఅలీ, ఉస్సేన్, గౌస్, అక్తర్, ఓమర్, అక్రం, శ్రీరాములు, సయ్యద్, షర్ఫుద్దీన్, ఖాదీర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల బందోబస్తు

వక్ఫ్ సవరణ చట్టాన్ని ముస్లింలు నిర్వహించిన భారీ ర్యాలీకి పెద్ద ఎత్తున పోలీసులు బందోబస్తు నిర్వహించారు. బేగంపేట, పేట్‌బషీరాబాద్ ఏసీపీలు మురళీకృష్ణ, రాములు ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్లు లక్ష్మీనారాయణరెడ్డి, రాహుల్ సమక్షంలో అల్వాల్, బోయిన్‌పల్లి, తిరుమలగిరి పోలీస్ స్టేషన్ల నుంచి బందోబస్తులో పాల్గొన్నారు. ర్యాలీ ప్రశాంతంగా సాగేలా పోలీసులు కృషి చేశారు.

ఎఫ్‌డీడీఐలో ప్రవేశాలకు దరఖాస్తు గడువు పొడిగింపు

రాయదుర్గం: కేంద్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ పర్యవేక్షణలో నిర్వహించే ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్(ఎఫ్‌డీడీఐ)–హైదరాబాద్‌లో అడ్మిషన్ల కోసం దరఖాస్తు గడువు తేదీని పొడిగించారు. ఈనెల 20 వరకు ఉన్న గడువును ఈనెల 30వ తేదీ వరకు పొడిగించినట్లు రాయదుర్గంలోని ఎఫ్‌డీడీఐ హైదరాబాద్ అధికారులు శుక్రవారం తెలిపారు. దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారానే చేయాల్సి ఉంటుంది. వివరాలకు 9440471336 నెంబరుకు ఫోన్ చేయవచ్చు.

కుడికుంట సుందరీకరణ చేపడతాం

గచ్చిబౌలి: కుడికుంటను పూర్తి స్థాయిలో సుందరీకరణ చేసి అందుబాటులోకి తీసుకొస్తామని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. శుక్రవారం మసీద్‌బండలోని కుడికుంటను జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. కుడికుంట చెరువులో పేరుకుపోయిన గుర్రపుడెక్కను తొలగించామన్నారు. చెరువు కట్టను, అలుగును పటిష్టం చేసి చుట్టూ మురుగు నీటి కాల్వ నిర్మిస్తామన్నారు. మురుగు నీరు చెరువులో కలువకుండ చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. చెరువు సంరక్షణలో భాగంగా చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి వాకింగ్ ట్రాక్ నిర్మాణం చేపడతామని ఎమ్మెల్యే వివరించారు. 64 చెరువులను అభివృద్ధిచేసి అందుబాటులోకి తీసుకొచ్చేందుకు సుందరీకరణ పనులు చేపడుతున్నామని అన్నారు. కార్యక్రమంలో కల్పనా రమేష్, నాయకులు గ్రంథాలయ డైరెక్టర్ గణేష్ ముదిరాజ్, స్థానికులు పాల్గొన్నారు.

ఆడపడుచులకు అండగా కల్యాణలక్ష్మి

మియాపూర్: ప్రజా సంక్షేమం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. మియాపూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శేరిలింగంపల్లి మండల పరిధిలోని లబ్ధిదారులకు కార్పొరేటర్లు ఉప్పలపాటి శ్రీకాంత్, మంజుల రఘునాథ్‌రెడ్డి, నార్నే శ్రీనివాస్‌లతో కలిసి ఆయన చెక్కులను పంపిణీ చేశారు. పేదింటి ఆడచడుచులకు అండగా కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ ఉన్నదని తెలిపారు. అధికారులు ఆర్ఐ శ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



కుడికుంట చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

కాలనీ సమస్యలను పరిష్కరిస్తా



సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్

ఓల్డ్ బోయిన్‌పల్లి: కాలనీలలో నెల కొన్న సమస్యలను పరిష్కరిస్తానని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అన్నారు. శుక్రవారం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ విఠల్ ఎన్‌క్లేవ్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ప్రారంభించారు. అనంతరం అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి కాలనీలో పర్యటించారు. డ్రైనేజీ సమస్య, సీసీ రోడ్డు నిర్మాణం, వీధి దీపాల మరమ్మతులను తక్షణమే జరిగేలా చర్యలు తీసుకుంటానని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో శ్రీనివాస్, రమేష్‌రెడ్డి, అజయ్, రవిచంద్రన్, మల్లేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎందుకిలా చేశావమ్మా!

- చిన్నారుల అంతరంగ ఆవేదన
- గుండెల్ని పిండేసిన జీడిమెట్ల ఘటన



తేజస్విని



అశిష్‌రెడ్డి, హర్షిత్‌రెడ్డి

ఎందుకమ్మా.. ఇంత దారుణానికి ఒడిగట్టావు. గోరుముద్దలు తినిపించి.. అల్లారుముద్దుగా పెంచి.. అనురాగాన్ని పంచి నీ ప్రాణానికి ప్రాణంగా చూశావు. కానీ.. ఇంతలోనే మా ప్రాణాలు తీసి నీవూ చనిపోయావెందుకమ్మా! కష్టమొస్తే నాన్నకు చెబితే తీర్చేవాడు కదా. మాకు ఆరోగ్య సంబంధ సమస్యలు, నీకూ అనారోగ్యం.. వీటిని తట్టుకోలేక నీ ఇద్దరు పిల్లల ఊపిరి తీశావు. మేమేం పాపం చేశామమ్మా.. అంటూ ఆ ఇద్దరు చిన్నారి బాలురు తమ హృదయావేదనను ఇలాగే వెలిబుచ్చేవారేమో! గురువారం జీడిమెట్ల పీఎస్ పరిధిలోని బాలాజీ లే అవుట్‌లో తల్లి తేజస్విని తన ఇద్దరు కుమారులు ఆశిష్ రెడ్డి (7), హర్షిత్‌రెడ్డి (5)లను వేట కొడవలితో నరికి.. ఆ తర్వాత అపార్ట్‌మెంట్‌పై నుంచి కిందికి దూకి తానూ ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. ఈ విషాదాంత ఘటనతో స్థానికులను కన్నీటి పర్యంతమయ్యారు. మృతురాలి భర్త, కుటుంబ సభ్యులు ఈ దారుణాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. శుక్రవారం పరిసర ప్రాంతాల్లో విషాద ఛాయలే కనిపించాయి. ఆ కుటుంబంలో తీరని శోకమే నిండుకుంది. మానసిక పరిస్థితి బాగా లేకపోవడంతోనే తేజస్విని ఇంతటి ఘాతుకానికి ఒడిగట్టిందని స్థానికులు చెబుతున్నారు. మాతృమూర్తి ఆదిలోనే ఇలా తమ ప్రాణాలను తీస్తుందని ఊహించే స్థితిలో లేని ఆ ముక్కుపచ్చలారని ఆమె ఇద్దరు కుమారులు ఆఖరి ఘడియల్లో ఎంతటి క్షోభ అనుభవించారో.. పాపం పసి పిల్లలు! – జీడిమెట్ల